క్లుప్తంగా...

నేడు బీఆర్ఎస్ బూత్ కమిటీల సమావేశం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్,గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలోని గ్రామాల బీఆర్ఎస్ బూత్ కమిటీల సమావేశం సోమవారం కండ్లకోయలోని నిమ్మల గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్‌యాదవ్ తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే సమావేశంలో ముఖ్య అతిథిగా మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు.

నేడు షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

ఘట్‌కేసర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అండర్ 14, 17 బాలబాలికల ఎంపిక సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల నిర్వహణ కార్యదర్శి వినోద్‌కుమార్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే బాలబాలికలు సోమవారం ఉదయం 8–8.30 గంటల్లోగా స్టేడియానికి చేరుకోవాలని సూచించారు. క్రీడాకారుల అర్హత ఫామ్‌లో ఫొటోతో పాటు బోనఫైడ్, ఆధార్ కార్డు, గతేడాది ప్రోగ్రెస్ కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, సర్టిఫికెట్లపై హెచ్ఎం సంతకం, స్టాంప్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.

ఓటును అమ్ముకోవద్దు

ఘట్‌కేసర్: డబ్బు, మద్యానికి ఓటును అమ్ముకోవద్దని, మన పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే వారికే ఓటు వేయాలని తెలంగాణ కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌కుమార్, ప్రభుద్ధ బారత్ జిల్లా బాధ్యుడు ఎం అరుణ్‌కుమార్ అన్నారు. ప్రభుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ఓటును మనకే వేసుకొని ఐక్యమత్యంతో ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని, అంబేడ్కర్ ఆలోచన విధానాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో మేకల దాసు, నర్సింగ్‌రావు, పాండుగౌడ్, వెంకటేశ్వర్‌రావు, అంజయ్య, గణేశ్‌గౌడ్, సురేశ్‌గౌడ్, ప్రదీప్‌గౌడ్, ఉపేందర్, సచిన్, నితిన్, సాయిచరణ్ పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న జూపల్లి లక్ష్మీనారాయణ

కీసర: యాద్గార్‌పల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సాదా సతీష్, తుమ్మ పోశయ్య, పట్నం రాములు, నిరుడు స్వామి కుటుంబ సభ్యులకు ఆదివారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత జూపల్లి లక్ష్మీనారాయణ రూ 5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలను ఆపద సమయాల్లో ఆదుకునేందుకు ముందుంటానన్నారు. మున్ముందు గ్రామంలో మరిన్ని సేవాకార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లేష్‌యాదవ్, మాజీసర్పంచ్ అక్కపల్లి అర్జున్, నేతలు మల్లేష్‌యాదవ్, బాల్‌నర్సింహ్మా, మల్లేష్, రమేష్, బాలరాజు, యాదయ్య, బిక్షపతి, లింగం, తదితరులుపాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మద్దతుగా చైర్ పర్సన్ ప్రచారం



ఘట్‌కేసర్‌లో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డిని గెలిపించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ఆదివారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మంత్రి మల్లారెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను ప్రచారం చేసి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో మైనారిటీ అధ్యక్షుడు కుతుబ్, మురళిగౌడ్, విజయ్‌ముదిరాజ్, ఫయూమ్, సందీప్‌చారి, హబీబ్, సలీం, శశిబేగం, అస్లాం, జావెద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గౌతంనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. ఆదివారం మిర్జాల్‌గూడలోని ఎల్లమ్మ ఆలయ ఆవరణలో ఆరుంధతి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి,మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయంతో తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి ఐదు నియోజకవర్గాలకు చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలైన్స్ టీం, పోలీసులు, ఎక్సైజ్, ఇన్‌కం ట్యాక్స్, జీఎస్టీ, నోడల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో వాహనాల తనిఖీలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని, పట్టుబడిన వాటిని ఎన్నికల నియావళి మేరకు సీజ్ చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో సామాన్యులకు ఇబ్బందులు కలగకుండా పట్టుబడిన వాటిపై బృందాల ద్వారా సమక్షించుకుని త్వరగా చర్యలు తీసుకోవాలన్నారు. నగదు, బంగారం, ఇతరతర వస్తువులు స్వాధీనం చేసుకున్నప్పుడు సరైన పత్రాలతో రికార్డులో నమోదు చేయాలన్నారు. అక్రమ మద్యం, నగదుపై గట్టి నిఘా ఉంచాలని, పట్టుకున్న నగదు జమకు సత్వరమే అకౌంట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ పై ఉన్నత స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని, విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం పనికి రాదని తెలిపారు. ఫిర్యాదులపై నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. నోడల్ అధికారులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని కోరారు. ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే.. వాటిని పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో నోడల్ అధికారి రమణమూర్తి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి (డీసీవో) శ్రీనివాసమూర్తి, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి, ఇండస్ట్రీస్ జి ఎం, రవీందర్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోండి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజలకు ఓటు వజ్రాయుధమని ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని, ఈనెల 31 వరకు 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఓటు హక్కు నమోదుపై జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో అవగాహన కల్పిస్తూ ప్రచారం చేస్తున్నామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తి ఓటు నమోదుకు అర్హులేనని, రాబోయే ఎన్నికల్లో ఓటు వేయాలంటే ఈ నెల 31లోగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. అభ్యర్థుల నామినేషన్లు ప్రారంభమైతే నూతన ఓటు దరఖాస్తుకు అవకాశం ఉండదన్నారు. ఉచిత డయల్ నంబర్ 1950కు ఫోన్ చేసినా సమాచారం అందజేస్తారని, ఓటర్ల జాబితాలో పేరు లేకపోయినా, పేరులో ఏమైనా తప్పులు ఉన్నా ఈ లోపే సరిచేసుకోవాలని సూచించారు.

డీఆర్సీ కేంద్రం పరిశీలన

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్‌రూమ్, పోలింగ్ కేంద్రాలను ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయావాలని, ఈ విషయంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించరాదని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. అల్వాల్‌లోని లయోలా కళాశాలలోని పోలింగ్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్వో కార్యాలయంలో నామినేషన్లు, కాల్‌సెంటర్, సువిధ యాప్‌లను స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆర్వో, ఏఆర్వోలతో ఫారం – 6,7,8 ,, పోస్టల్ బ్యాలెట్ 12(డీ)కి డిస్పోజల్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 6,69 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, 582 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దుండిగల్, కొంపల్లి, నిజాంపేట, బాచుపల్లి, గాజుల రామారం, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో తొమ్మిది మంది ఏఆర్వోలు విధులు నిర్వహిస్తారన్నారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులతోపాటు పార్కింగ్, ర్యాంప్, మంచినీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నీచర్, టాయిలెట్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్‌క్యాస్టింగ్ కోసం విద్యుత్తు సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి.. సంక్షేమం



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టం కట్టాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమపథకాలు దేశానికి దిక్సూచిగా నిలిచాయన్నారు. పేదల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓట్లు వేసి మరోసారి గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం జరిగిందన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో స్ట్రామ్‌వాటర్ పైప్‌లైన్, సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను అభివృద్ధి చేశామన్నారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చేప్పే కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఒక్కసారి మోసపోతే ఇక సాధించుకున్న తెలంగాణ ఆగమైపోతుందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నారు. సీఎం కేసీఆర్ పేర్కొన్నట్లుగా పింఛన్ పెంపు, రైతుబంధు పెంపు తదితర హామీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ ఎంతో మేలు చేసిందని, సుధీర్‌రెడ్డి మాత్రం ఏమి చేశాడో ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌నేతలంతా కలిసికట్టుగా పనిచేసి పార్టీ గెలుపుకోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌రాష్ట్ర నేతలు, చామకూర మహేందర్‌రెడ్డి, చామకూర భద్రారెడ్డి, మున్సిపల్ చైర్మెన్లు వసుపతి ప్రణీతాగౌడ్, కొకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్లు మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బండారి మల్లేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సంపబోల్ హరిగౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, తేళ్ల శ్రీధర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చుకుంటే ఎమ్మెల్యే అవుతారా..?

మేడ్చల్: నేతలు పేరు మార్చుకుంటే ఎమ్మెల్యేలు కాలేరని ప్రజలకు సేవ చేస్తేనే ఎమ్మెల్యేలు అవుతారని తన కంటే ప్రజా సేవ, అభివృద్ధి చేసిన వారు ఉంటే వారికే ఓటెయ్యాలని, తనకు రాజకీయం అవసరం లేదని ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని మంత్రి, మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం మేడ్చల్‌లో జరిగిన రోడ్ షో అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న జంగయ్య యాదవ్ రెండు సార్లు పోటీ చేసినా గెలవలేదని పేరు మార్చుకుని వజ్రేష్ యాదవ్‌గా తిరిగి పోటీ చేస్తున్నారని ఆయన ఎం చేసినా గెలుపు తనదేనన్నారు. పేరు మార్చుకుని ఊరు మార్చుకుని వస్తే ప్రజలు ఆదరించరని తాను సొంత డబ్బులు పెట్టి ప్రజా సేవ చేస్తున్నాని రోడ్లు, గుళ్లు నిర్మించానని ప్రభుత్వం ద్వారా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశానన్నారు. మైనంపల్లి ఓ పిల్లి అని ఆయన వల్ల ఒరిగేదేమీ లేదన్నారు. ఆయన జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరితో పాటు జిల్లాలో అన్ని సీట్లు బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తాను నాన్‌లోకల్ అయితేనే ప్రజలు నన్ను మొదటి సారి గెలిపించారా అని ప్రశ్నించారు. తాను పుట్టింది మైసమ్మగూడ గ్రామమని, తాను ప్రజల మనిషినని తనను ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రజల కోసం కాకుండా స్కాంల కోసం పని చేస్తుందని అన్నారు.



ప్రజా ఆశీర్వాదసభలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

బీఆర్ఎస్ పథకాలు దేశానికే ఆదర్శం



నాగారం మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న చామకూర భద్రారెడ్డి తదితరులు



బీఆర్ఎస్‌లో చేరుతున్న యువకులు

కీసర: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని బీఆర్ఎస్ రాష్ట్రనేత చామకూర భద్రారెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఆయన మున్సిపల్ చైర్మెన్ కొకుట్ల చంద్రారెడ్డితో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీలు, మండలాల్లో, పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించిన మంత్రి మల్లారెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. రానున్న కాలంలో ప్రజలకు మరిన్ని సంక్షేమ అభివృద్ధి పనులు కొనసాగాలంటే బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలన్నారు. వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్లశ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, కౌన్సిలర్లు కొకుట్ల అనంతరెడ్డి, నేతలు గూడురు అంజన్న, కొకుట్ల రాహుల్‌రెడ్డి, పాషబాయ్, లావణ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం గ్రామానికి చెందిన యువకులు ఆదివారం మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, యువకులకు మల్లారెడ్డి క్యాంపు కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లారెడ్డి, జగన్‌రెడ్డి, నవీన్, రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

1న మల్కాజిగిరికి మంత్రి హరీష్‌రావు రాక

అల్వాల్: మంత్రి హరీష్‌రావు నవంబర్ 1న మల్కాజిగిరి నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం అల్వాల్‌లోని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి హరీష్‌రావు బుధవారం మల్కాజిగిరి నియోజకవర్గ పార్టీ కార్యకర్తలతో సమావేశం కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, మేకల సునీత యాదవ్, జితేందర్‌రెడ్డి, అనిల్ కిషోర్‌గౌడ్, గోలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ లో మల్లారెడ్డి భారీ రోడ్ షో



రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి

మేడ్చల్: మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ పట్టణంలో ఆదివారం భారీ రోడ్ షో నిర్వహించారు. పట్టణంలోని అన్ని ప్రధాన వీధుల మీదుగా ఈ రోడ్‌షో సాగింది. ఈ సందర్భంగా మహిళలు మంత్రికి హారతులు పట్టి స్వాగతం పలకగా బోనాలు, బతుకమ్మలతో, వివిధ రూపాల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ర్యాలీలో మున్సిపల్ చైర్మన్‌లు లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, దీపిక నర్సింహారెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, నందారెడ్డి, రాజమల్లారెడ్డి, భాస్కర్‌యాదవ్ , నర్సింహ్మారెడ్డి, శేకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలంలోని పలు గ్రామాలకు ఇతర పార్టీల నాయకులు ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మండల పరిధిలోని పోతారం, అనంతారం గ్రామాలకు చెందిన పలువురు నేతలు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి అనిల్‌రెడ్డి, సర్పంచ్ హరిమోహన్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డిని గెలిపించాలని కోరుతూ మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శాలినీ మహేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, నాయకులు మేకల అయ్యప్ప, భార్గవ్‌రామ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి

ఘట్‌కేసర్: ప్రతిపక్ష పాత్రలో కాంగ్రెస్, పరిపాలనలో బీఆర్ఎస్ పార్టీలు ఘోరంగా విఫలమయ్యాయని బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బంధన్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు విప్పర్ల హనుమాన్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన బీజేపీ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం నక్సలైట్లను ఎదిరించి పోరాడిన పార్టీ, ధర్మం, సమసమాజ నిర్మాణం, అవినీతికి తావులేని పాలన అందిస్తున్న ఏకైక పార్టీ బీజేపీయేనన్నారు. సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పుకుంటున్న మంత్రి మల్లారెడ్డి ఆ పనుల బిల్లులు కోసం తీర్మానాలు ఇవ్వాలని సర్పంచ్‌లపై ఒత్తిడి తేవడం విడ్డూరంగా ఉందన్నారు. యూనివర్సిటీకి అనుమతులు తెచ్చుకున్న మంత్రి మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి కనీసం నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల తేలేకపోవడం సిగ్గుచేటన్నారు. సంక్షేమ పథకాల పేరుతో కర్ణాటకలో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా నిత్యం ధర్నాలు జరుగుతున్నాయన్నారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శోభారాణి, అచ్చిన నర్సింహ మాట్లాడుతూ అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా ఐక్యంగా పనిచేసి గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బాల్‌రాజ్‌ముదిరాజ్, లక్ష్మారెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, మున్సిపల్, మండల ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, రామతీర్థ, శ్రీశైలం, పోచారం అధ్యక్షుడు సురేశ్‌నాయక్, ఆంజనేయులుగౌడ్, శ్రీరాములు, శశికాంత్‌రెడ్డి, రమేశ్‌పెరిక పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డి ఓటమి ఖాయం



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్: తెలంగాణలో బీఆర్ఎస్, మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డి ఓటమి ఖాయమని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రతాపసింగారంలో చౌదరిగూడకు చెందిన పలువురు నాయకులు గ్రామశాఖ అధ్యక్షుడు కట్ట ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీరేందర్‌సింగ్‌తో పాటు పలువురికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రికి మతి భ్రమించి మాట్లాడుతున్నాడని, ఆయన విజ్ఞతకే వదిలి వేస్తున్నానన్నారు. నియోజకవర్గంలో మంత్రి చేసింది శూన్యమని, కబ్జాకోరు, అవినీతి పరుడైన మంత్రిని, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. బీరేందర్‌సింగ్, అర్జున్ సింగ్, రాజేశ్‌కుమార్, అసీరాబేగం, రాణా తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్, కుమార్‌ముదిరాజ్, వార్డు సభ్యుడు భోజిరెడ్డి, ఎస్ నర్సింహ్మా, చంద్రమౌళి ముదిరాజ్, ఎస్ నర్సిహ్మా, దావిద్‌రెడ్డి, నర్సింగ్‌రావు ముదిరాజ్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి నిమజ్జన ఊరేగింపు



ఘట్‌కేసర్: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో నాగులమ్మ ఆలయం వద్ద మామిండ్ల ముత్యాలుయాదవ్ ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహ నిమజ్జనం ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న అమ్మవారిని విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించారు. నాగులమ్మ మహంకాళి ఆలయం నుంచి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు అంబేడ్కర్ చౌరస్తా, బస్ టెర్మినల్, కొండాపూర్ రైల్వేగేటు మీదుగా కన్నుల పండువగా సాగింది. కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బ్యాండ్ మేళాలు, డప్పుల శబ్దాలకు అనుగుణంగా యువకుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం చిన్నచెరువులో నిమజ్జనం చేశారు.

జయలలిత డబ్బులు కాజేసి పైకొచ్చాడు

మంత్రి మల్లారెడ్డిపై మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మేడ్చల్ రూరల్: పాలమ్మి, పూలమ్మి మంత్రి మల్లారెడ్డి ధనవంతుడు కాలేదని, తమిళనాడు మాజీ సీఎం, దివంగత జయలలిత డబ్బులు దొంగిలించి, ఇతరుల ఆస్తులు కాజేసి పై కొచ్చాడని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం రాత్రి మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్ యాదవ్, రాష్ట్ర నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో తమిళనాడు దివంగత సీఎం జయలలితకు నగర శివార్లలోని కొంపల్లిలో 11 ఎకరాల స్థలం ఉండేదని అందులో డైయిరీ ఫాం ఏర్పాటు చేసుకుందన్నారు. ఆ సమయంలో పాలవ్యాపారం చేసేందుకు మల్లారెడ్డి అక్కడికి వెళ్లేవాడన్నారు. ఐటీ దాడులు జరగనున్నట్లు జయలలితకు సమాచారం అందడంతో తన వద్ద ఉన్న డబ్బు, నగలు ఓ చోట దాచిపెట్టగా మల్లారెడ్డి వాటిని దొంగిలించాడన్నారు. తన ఇంటి పక్కన ఉండే క్రిస్టియన్ విద్యా సంస్థల యజమానురాలిని మోసం చేసి కుటుంబీకులకు తెలియకుండా సంతకాలు పెట్టించుకుని ఆమె చనిపోయిన తర్వాత ఆమె ఆస్తి కాజేశాడని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు అమ్ముకున్న వ్యక్తి ఇప్పుడు నీతులు చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన మైసమ్మగూడలో చెరువు శిఖం స్థలాలను కబ్జా చేసి అక్రమంగా కాలేజీలు కట్టడం వల్లే మొన్న భారీ వర్షాల కారణంగా విద్యార్థులు వరదల్లో చిక్కుకున్నారన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై విమర్శలు చేసిన బీఆర్ఎస్ నాయకులు చివరకు తమ మేనిఫెస్టోను కాపీ కొట్టారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుటుంబానికి పదవీ వ్యామోహం ఎక్కువన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బులు పంచి, బెదిరింపులకు పాల్పడి గతంలో గెలిచారని కానీ ఈ సారి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. మంత్రి మల్లారెడ్డి, అతని బావమరిది గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్మన్ పదవుల్లో ఉండి చేసిందేమీ లేదన్నారు. తమ వ్యాపారాల కోసమే మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. మంత్రి మల్లారెడ్డి వెలుగులోకి తెస్తామని తనకు మేడ్చల్ ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్, మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్, నాయకులు రమణారెడ్డి, మహేశ్‌గౌడ్ పోచయ్య, వరదారెడ్డి, కృష్ణారెడ్డి, మల్లేశ్‌గౌడ్ నడికొప్పు నాగరాజు, రంజిత్, రాహుల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.